ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

గురువారం 23 మే 2024 | 5

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	38	30



నోటా ఎవరిని ముంచేనో!

అమలాపురం టౌన్, మే 22: నోటా.. ఎవరి నోట విన్నా అదే మాట. ఓటు వేయడం మానకు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటాకు ఓటేసెయ్ అన్నారు. అంతే 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు ఓటేసారెందరో. స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారే కాదు చివరకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు సైతం దరిదాపుల్లో కూడా ఓట్లు దక్కించుకోలేదంటే నోటా పవరేమిటో తెలిసింది. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఎన్నికల్లో ప్రధానంగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నోటాకు కాదు మా పార్టీకి ఓటేయమని ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ప్రచారం చేసుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. స్వతంత్ర అభ్యర్థుల కంటే నోటా వల్లే ఎక్కువ ప్రమాదం ఉందని ముందే గుర్తించారు. మీ అభ్యర్థి మీకు నచ్చకపోతే మా పార్టీకి ఓటు వేయండని వేడుకున్నారు. నోటా పవరేమిటో జూన్ 4న తెలియనుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ స్థానంలోనే కాదు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ నోటా నాలుగో స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పోటీదారులను మినహాయించి బీజేపీకి 11,448, కాంగ్రెస్‌కు 7,855 ఓట్లు పోలవ్వగా నోటాకు అత్యధికంగా 16,373 ఓట్లు పోలయ్యాయి. ఇక స్వతంత్ర అభ్యర్థులెవరూ నోటాకు దరిదాపుల్లో లేరు.

ఈసారి ఎన్నికల్లో నోటాతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఏ పార్టీ అభ్యర్థుల కొంప ముంచుతారో అన్న చర్చ జరుగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఎస్పీలతో పాటు ప్రతి నియోజకవర్గంలోనూ ఏడు నుంచి ఎనిమిది మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఆ రెండు పార్టీలతో పాటు ఆయా అభ్యర్థులకు వచ్చే ఓట్ల సంఖ్య ఏ పార్టీ ఓట్ల శాతాన్ని తగ్గిస్తుందోనన్న ఆందోళన నెలకొంది.

స్వతంత్ర అభ్యర్థుల పోటీ అందుకేనా...

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. ఒక్కసారైనా పోటీ చేయాలని ఒకరిద్దరు భావిస్తే నాలుగైదు పర్యాయాలుగా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన వారూ ఉన్నారు. ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులు ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇవ్వాలన్న తలంపుతో ప్రచారాలు సైతం నిర్వహించారు. ఇక అధికారం నిలబెట్టుకునేందుకు ఈసారి ఓ ప్రధాన రాజకీయ పార్టీ స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దింపింది. చివరకు ఆ పార్టీ అనుచరులే దగ్గరుండి స్వతంత్ర అభ్యర్థులతో నామినేషన్లు వేయించి పోటీ చేయించిన పరిస్థితులు ఉన్నాయి. వారికి అవసరమైన అన్ని సదుపాయాలనూ ఆ పార్టీ నేతలే అందించారు. కొందరు అభ్యర్థులైతే ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం కూడా చేసుకోలేదు. మరి ఇంతమంది స్వతంత్ర అభ్యర్థులు ఎందుకు బరిలో ఉన్నారన్న చర్చ అటు అధికారుల్లోను, ఇటు సామాన్యుల్లోను ఉంది. ప్రధాన రాజకీయ పార్టీల తరఫున పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా ఆయా స్వతంత్ర అభ్యర్థుల నుంచి పాస్‌లు తీసుకుని వారిని పంపించడం విశేషం. చివరకు ఓట్ల లెక్కింపులోనూ స్వతంత్ర అభ్యర్థులు 10 నుంచి 14 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఆ ఏజెంట్లుగా ప్రధాన పార్టీల ప్రతినిధులు వెళ్లేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా అభ్యర్థులతో చర్చలు సైతం ముగిసినట్టు సమాచారం.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో...

నియోజకవర్గం	బీజేపీ	కాంగ్రెస్	నోటా
ముమ్మిడివరం	1,481	1,386	2,846
అమలాపురం	1,563	1,212	2,357
పి.గన్నవరం	2,268	1,069	3,020
రాజోలు	1,340	858	1,621
కొత్తపేట	1,873	952	2,395
మండపేట	1,446	1,378	2,086



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఖాదర్‌బాషా

15రోజులు బాణసంచా అమ్మకాలు నిలుపుదల చేయాలి

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం టౌన్, మే 22: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం పలుచోట్ల చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం పలు ఆదేశాలు జారీ చేసిందని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా లూజుగా పెట్రోలు అమ్మకాలు నిర్వహించరాదని, బాణసంచా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వర్తకులు, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులతో జేసీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వ్యాపారులు పరస్పర సహకారం అందించాలని జేసీ కోరారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా బాణసంచా తయారీ, అమ్మకాలను 15 రోజుల పాటు నిర్వహించరాదని ఆమె స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా మాట్లాడుతూ ప్రస్తుతం గోదాముల్లో ఉన్న బాణసంచా వివరాలను నమోదు చేసి సీలు వేయించాలని డీఎస్పీలను ఆదేశించారు. ఎక్కడైనా బాణసంచా అమ్మినట్టు రుజువైతే కేసుల్లో ఇరుక్కునే ప్రమాదం ఉందని, వ్యాపారుల అనుమతులు రద్దు చేయడంతో పాటు గోదాములను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జూన్ 10 వరకు బాణసంచా విక్రయాలను నిలుపుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్పీలు ఎం.మహేశ్వరరావు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



గోదావరి నదీ పాయను ఆనుకుని తెరుచుకున్న ముంజవరం లాకులు

తెరుచుకున్న లాకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమలాపురం రూరల్, మే 22: 'రైతుల స్వార్థంతో లాకులు మూసివేత' శీర్షికన ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. పి.గన్నవరం మండలం ముంజవరం వద్ద అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్ లాకులు మూసివేయడం వల్ల రెండు వేల మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి గండి పడుతుందని మత్స్యకార సంఘ నాయకులు ఆందోళన చెందారు. లాకులు తెరిపించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంతో పాటు మత్స్య, డ్రైనేజీ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందించారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు గోదావరి నదీపాయను ఆనుకుని ఉన్న లాకు తలుపులు ఎత్తివేయడంతో సముద్రపు ఆటు పోటు నీరు మేజర్ డ్రెయిన్‌లోకి వచ్చిచేరుతుండడం పట్ల మత్స్యకార సొసైటీ నాయకులు ధర్మాడి ఏడుకొండలు, లంకాడి ప్రసాద్, కామాడి సత్యరాజనాయకర్, నేదునూరి సత్యనారాయణ, కోట శ్రీరాములు, పి.రాధాకృష్ణ, మల్లాడి ధర్మరాజు, కొప్పాడి నాగరాజు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువున పోలీసుల పహారా

బ్యారేజీ దిగువున పోలీసు బందోబస్తు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, మే 22: ఉభయ గోదావరి జిల్లాల వారధి అయిన కాటన్ బ్యారేజీ దిగువున గోదావరిలో పర్యాటకులు స్నానాలు చేయకుండా పోలీసులు నిలువరించారు. 'సరదా... కారాదు విషాదం' శీర్షికన ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. బుధవారం ఎస్‌ఐ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఎవరూ స్నానాలు చేయకుండా చర్యలు చేపట్టారు.



శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా: ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, మే 22: ఓట్ల లెక్కింపు రోజున జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను బుధవారం ఆయన పరిశీలించారు. మూడంచెల భద్రతతో పాటు నిఘాకై ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును చూశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లే విధంగా ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌లను తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా జూన్ పదో తేదీ వరకు బాణసంచా తయారీ, గొడౌన్లలో నిల్వలు, అమ్మకాలపై నిషేధం విధించామని చెప్పారు.

కేంద్ర బలగాలు, పోలీసులతో కలిసి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన క్యాసో (కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్)లో 76 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను సీజ్ చేసినట్టు అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా తెలిపారు. అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో ఐ.పోలవరం మండలం జి.మూలపొలంలో నిర్వహించిన క్యాసోలో 24 మోటారు సైకిళ్లు, ఆటోను సీజ్ చేశారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ నల్లమిల్లి రాజీవ్ గృహకల్పలో నిర్వహించిన క్యాసోలో పది బైకులను సీజ్ చేశారు. ఉప్పలగుప్తం ఎస్‌ఐ కేఆర్ మనోహర్ జోషితో కలిసి వాసాలతిప్పలో నిర్వహించిన క్యాసోలో 14 బైకులు సీజ్ చేశారు. కొత్తపేట డీఎస్పీ కె.వెంకటరమణ, పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ బి.శివకృష్ణ ఆధ్వర్యంలో గాజులగుంటలో నిర్వహించిన క్యాసోలో రెండు మోటారు సైకిళ్లు సీజ్ చేశారు. రామచంద్రపురం రాజుబాబు నగర్‌లో ఆకస్మికంగా నిర్వహించిన క్యాసోలో 20 మోటారు సైకిళ్లు సీజ్ చేసినట్టు డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. మండపేట సీఐ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో చిన ద్వారపూడిలో నిర్వహించిన క్యాసోలో ఆరు బైకులను సీజ్ చేశారు.

సరిహద్దులు మీరి..

- గోదావరి నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు
- ప్రతిమా సంస్థ అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ
- అమలుకు నోచుకోని సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు



ఆత్రేయపురం మండలం ఊబలంక-మెర్లపాలెం సరిహద్దులో ఇసుక తవ్వకాలు (పాత చిత్రం)

ఆత్రేయపురం, మే 22:

గోదావరి నదీగర్భంలో ఇసుక తవ్వకాలకు అనుమతి పొందిన ప్రతిమా సంస్థ మైనింగ్ నిబంధనలకు గోదావరిలో పాతర వేసింది. ఉమ్మడి గోదావరి జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో అడ్డూఅదుపూ లేకుండా అక్రమాలకు పాల్పడినట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలను నిరోధించాల్సిన అధికారులు ప్రభుత్వంలోని అధికార పార్టీ నేతల మంత్రదండంతో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. మరోపక్క గ్రామాల సరిహద్దులు చెరిపివేశారు. ఏ స్థాయిలో అంటే రావులపాలెం-ఊబలంక రీచ్‌లో అనుమతి పొందిన ప్రతిమా కంపెనీ సరిహద్దు గ్రామమైన ఆత్రేయపురం మండలం మెర్లపాలెం రెవెన్యూ పరిధిలోని గౌతమి గోదావరి నదీగర్భంలో చొరబడి సుమారు రూ.3కోట్లు విలువ చేసే 30వేల మెట్రిక్ టన్నుల ఇసుక హద్దులు చెరిపివేసి కొల్లగొట్టుకుపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై అధికారులకు చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలు అయ్యాయి. జిల్లావ్యాప్తంగా వివిధ రీచ్‌ల్లో అక్రమాలపై ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదులను సైతం అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. అయితే ఈ నెల 16న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో అధికారుల్లో కదలిక మొదలైంది. జిల్లా ఇసుక కమిటీ చైర్మన్ కలెక్టర్ శుక్లాతో పాటు కమిటీ సభ్యులు అనుమతి పొందిన ఇసుక రీచ్‌ల్లో జరిగిన తవ్వకాల తీరును పరిశీలించేందుకు పరుగులు తీశారు. అయితే అక్రమాలు జరిగిన రీచ్‌లను పరిశీలించకుండా వెళ్లారనే ఆరోపణలూ లేకపోలేదు. తూర్పు గోదావరి జిల్లా తీపర్రు, ఉసులుమర్రు రీచ్‌ల్లో అనుమతి పొందిన ప్రతిమా కంపెనీ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం పరిధిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఊబలంక రీచ్‌లో అనుమతి పొంది జియోకో-ఆర్డినేషన్ పరిధి దాటి మెర్లపాలెం సరిహద్దులో అక్రమ తవ్వకాలు సాగించారని సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా ఇసుక కమిటీ కొరడా ఝుళిపిస్తుందో... సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అధికారులు అమలు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.



అమలాపురం నుంచి అంబాజీపేట మీదుగా వెళ్లే ఏజీ రోడ్డు నిర్మానుష్యంగా మారిన దృశ్యం

భానుడి భగభగలు

- సూర్య ప్రతాపంతో అల్లాడుతున్న జనం
- నిర్మానుష్యంగా రహదారులు
- ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్న ప్రజలు

అమలాపురం టౌన్, మే 22:

భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణీ కార్తె ప్రారంభం కాకముందే సూర్యుడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. ఒకవైపు మండుతున్న ఎండలు... మరోవైపు ఉక్కపోతతో జనం తల్లడిల్లుతున్నారు. బుధవారం భానుడి ప్రతాపానికి ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. జిల్లా, డివిజన్ స్థాయి ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలున్న అమలాపురం-ముక్తేశ్వరం రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లో జనసంచారం లేదు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఎక్కడో గానీ చలివేంద్రాలు లేకపోవడంతో దాహంతో బాటసారుల గొంతెండి పోయింది. సాయంత్రం వేళ బయటకు వచ్చిన జనం కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ పార్లర్లవైపు పరుగులు తీశారు. అమలాపురం నుంచి అంబాజీపేట మీదుగా వెళ్లే ఏజీ రోడ్డు ఉదయం పది గంటలకే నిర్మానుష్యంగా మారిపోయింది. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.



ఈదరపల్లి వంతెన వద్ద నిర్మానుష్యంగా మారిన రహదారి





కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి, నల్లవంతెన వద్ద మెయిన్‌రోడ్డులో జనసంచారం లేని దృశ్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 21 కేంద్రాలు

పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి: డీఆర్వో వెంకటేశ్వర్లు

అమలాపురం టౌన్, మే 22: ఈ నెల 24 నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ జనరల్, ఒకేషనల్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జనరల్ కేటగిరీలో 7,733 మంది, ఒకేషనల్‌కు 1,015 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. 8,748 మంది విద్యార్థుల కోసం జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. 31వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జూన్ 1న లాంగ్వేజ్ పరీక్ష ఉంటుంది. జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.సోమేశేఖరరావు మాట్లాడుతూ ట్రాన్స్‌కో అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో డీఈవో ఎం.కమల కుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.

1.68 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగుకు ఏర్పాట్లు

- నారుమడులకు వరి విత్తనాలు సిద్ధం
- జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



ఆలమూరు, మే 22: జిల్లాలో ఈ ఏడాది 1,68,780 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు తెలిపారు. ఖరీఫ్ సీజన్లో 33,756 క్వింటాళ్ల విత్తనాలు కావాల్సి ఉందని, దీనిలో 23,056 క్వింటాళ్ల రైతు నుంచి రైతుకు సర్దుబాటు జరుగుతుందని, 7,200 క్వింటాళ్ల ప్రైవేట్ డీలర్ల నుంచి, మిగిలిన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తామని వివరించారు. బుధవారం ఆయన ఆలమూరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎంటీయూ-7029 రకం 1,26,541 ఎకరాల్లో, ఎంటీయూ-1318 రకం 11,424 ఎకరాల్లో, ఎన్‌పీ-9558 రకం 6,413 ఎకరాల్లో, సాంబ, స్వర్ణ రకాలు 3,207 ఎకరాల్లో, ఎంటీయూ-1064 రకం 2751 ఎకరాల్లో, ఇతర రకాలను 1,546 ఎకరాల్లో సాగు చేసేందుకు గుర్తించామన్నారు. ఖరీఫ్ సీజనుకు 42,493 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమన్నారు. ఇందులో యూరియా 16,120 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,859 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3,719 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 17,689 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 2,106 మెట్రిక్ టన్నులకు ఇండెంట్ పెట్టామన్నారు. కాలువలకు సాగునీరు ఇచ్చిన వెంటనే నారుమడులు త్వరితగతిన వేసి సాగుకు సిద్ధం కావాలని బోసుబాబు రైతులకు పిలుపునిచ్చారు.

కోనసీమలో పరిఢవిల్లిన బౌద్ధ ధర్మం

గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా కథనం

... 7లో

కోనసీమలో పరిఢవిల్లిన బౌద్ధం





ఆదుర్రు బౌద్ధ స్థూపం



మానవునిగా జన్మించి భగవంతునిగా ఎదిగిన వారిలో బుద్ధ భగవానుడు ఒకరు. తథాగతుడు చూపిన మార్గమే నేడు బౌద్ధ ధర్మంగా విశ్వవ్యాప్తమైంది. మహోన్నతమైన బౌద్ధ ధర్మం ఏనాడో కోనసీమ జిల్లాలో పరిఢవిల్లింది. జిల్లాలో పలుచోట్ల బౌద్ధ ధర్మ ప్రచార అవశేషాలు నేటికీ లభ్యమవుతున్నాయి. బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా నిర్మించిన బౌద్ధ చైత్యాలకు ప్రత్యేక స్థానం ఉంది. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బౌద్ధ చైత్యాలు సారనాథ్, అమరావతిలతో పాటు ఆదుర్రులో మాత్రమే ఉన్నాయి. 1930వ దశకంలో బ్రిటిష్ పాలకులు మద్రాసులోని ఆర్కియాలజీ డిపార్టుమెంటు సహకారంతో చేపట్టిన పరిశోధనల్లో ఆదుర్రు బౌద్ధ క్షేత్రం బయటపడింది. ఈ బౌద్ధ చైత్యాన్ని అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర ధర్మ ప్రచారంలో భాగంగా నిర్మించినట్టు చారిత్రక ఆదారాలున్నాయి. **అమలాపురం టౌన్, మే 22:**

పురా...ణ ప్రసిద్ధినొందిన ద్రాక్షారామం కూడా బౌద్ధ ఆరామమేనని బుద్ధిస్టుల నమ్మకం. అదే విధంగా సామర్లకోటలోని భీమేశ్వరాలయంలో బుద్ధుని ప్రతిమలను ఇందుకు నిదర్శనంగా చెప్తారు. బౌద్ధ ఆరామాలతో పాటు స్థూపాల కింద బుద్ధుని కాలం నాటి అవశేషాలు ఉంటాయని వారి ప్రగాఢ నమ్మకం. అశోక చక్రవర్తి దేశవ్యాప్తంగా 84వేల స్థూపాలను నిర్మించారు. వీటన్నింటిలో బుద్ధుని ధాతువులు ఉంటాయి.

దుఃఖానికి మూలం కోరిక

దుఃఖానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. కానీ మూల కారణం మాత్రం కోరిక అని బుద్ధుడు చెబుతాడు. దుఃఖ నివారణకు ఎనిమిది మార్గాలను ఆయన సూచించారు. పున్నమి చంద్రునితో బౌద్ధ ధర్మం ఎంతో ముడిపడి ఉంది. ఇక వైశాఖ పౌర్ణమికి గౌతమ బుద్ధునితో విడదీయరాని సంబంధం ఉంది. ప్రపంచ చరిత్రలో అపూర్వ సంఘటనలుగా అవి నిలిచాయి. వైశాఖ పౌర్ణమి రోజున లుంబినీ వనంలో సిద్ధార్థుడుగా గౌతముడు జన్మించాడు. వైశాఖ పౌర్ణమి రోజునే ఇల్లు విడిచి ఉరువేల అటవీ ప్రాంతానికి చేరుకుని రావి చెట్టు (బోధి వృక్షం) కింద జ్ఞానోదయం పొంది గౌతమ బుద్ధుడయ్యాడు. మరలా వైశాఖ పౌర్ణమి రోజునే కుశినగర్‌లో బుద్ధుడు మహాపరినిర్వాణము చెందారు. బుద్ధుని జీవితంలోని ప్రధాన ఘట్టాలన్నీ వైశాఖ పౌర్ణమి రోజునే జరగడం చరిత్రలోనే అపూర్వ సంఘటనగా నిలిచింది.

పునర్జన్మను అంగీకరించని బౌద్ధం



బౌద్ధం పునర్జన్మను అంగీకరించదు. ఆత్మవాదానికి పూర్తిగా వ్యతిరేకం. ఎందుకంటే ఆత్మవాదంతోనే కుల వ్యవస్థకు బలం వచ్చింది. బుద్ధుని అనాత్మవాదం ఆత్మలేదని చెబుతుంది. బౌద్ధ ధర్మంలో పాప పుణ్యాలున్నాయి. మంచి పనులు, చెడు పనులు ఉన్నాయి. అయితే ఆయా పనుల ఫలితాన్ని ఈ జన్మలోనే అనుభవించక తప్పదని చెబుతుంది. బౌద్ధం ప్రధానంగా మానవీయత గురించి క్రీస్తుకు పూర్వమే చెప్పింది.

డీబీ లోక్, త్రిరత్న బుద్ధవిహార్ సెక్రటరీ జనరల్

నేడు బుద్ధ జయంతి వేడుకలు

అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, త్రిరత్న బుద్ధ విహార్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయి. ఉదయం బౌద్ధ భిక్షువులచే పూజా కార్యక్రమాలతో ప్రారంభించి బుద్ధ భగవానుని ప్రతిమ, పంచశీల జెండాలతో ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు. బీఎస్ఐ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో పాటు కలెక్టర్‌హిమాన్షు శుక్లా, బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి సూర్యారావు పాల్గొంటారని అధ్యక్షుడు నాగాబత్తుల ప్రసాదరావు తెలిపారు.

ఘనంగా నృసింహ జయంతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, మే 22: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నృసింహ జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. 8 గంటలకు నక్షత్ర మాలదీక్షా ధారులతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి వచ్చిన భక్తులు ఇరుముళ్లు సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని 27 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో దీక్ష నిర్వహించిన భక్తులు బుధవారం స్వామివారి సన్నిధిలో జరిగిన ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసకిరణ్, స్థానాచార్యులు వి.రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు జి.రాజేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రథోత్సవంలో పాల్గొన్న చైర్మన్, ఈవో







వైభవంగా రథోత్సవం

అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిన అన్నవరం

అన్నవరం, మే 22: సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలలో నిర్వహించే గ్రామసేవలలో భాగంగా బుధవారం సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను రూ.1.20 కోట్లతో తయారు చేయించిన నూతన టేకు రథంపై ఆశీనులు గావించారు. చైర్మన్ ఐ.వి రోహిత్, ఈవో రామచంద్రమోహన్ రథోత్సవం ప్రారంభించారు. నూతన రథానికి కుంభం పోసి ముందుకు కదిలించారు. తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ఆంధ్రాబ్యాంక్ వరకు వెళ్లి అక్కడనుంచి సత్యదేవుడి కొండపైకి వెళ్లే టోల్‌గేట్ వరకు కొనసాగి తిరిగి పంపాసత్రం వద్ద ముగిసింది. ఆలయ అధికారులు తొలిసారిగా పెద్దరథంతో ఉత్సవాన్ని చేపట్టడంతో అశేష భక్తజనంతో అన్నవరం మెయిన్‌రోడ్డు జన సందోహాన్ని తలపించింది. దేవస్థానం ఉద్యోగులు యావన్మంది ఈ రథోత్సవంలో పాల్గొనాలని ఈవో సర్క్యులర్ జారీ చేయడంతో ప్రతిఒక్క ఉద్యోగి హాజరయ్యారు. టీడీపీ నాయకుడు రఘురామకృష్ణంరాజు దంపతులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 3500 కిలోల బరువుతో సుమారు 35 అడుగులు పొడవున్న ఈ రథసేవ తొలిసారి ప్రారంభించడంతో ఎటువంటి అవాంతరాలు జరగకుండా నిష్ణాతులైన మత్స్యకారులతో రథం లాగించారు. ఈవో రామచంద్రమోహన్ మైక్ ద్వారా సూచనలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సుమారు 100 మంది పోలీసులు తగు జాగ్రత్తలతో బందోబస్తు నిర్వహించారు. అంతకు ముందు రథాన్ని తయారు చేసిన శిల్పులను ఈవో, చైర్మన్ రోహిత్ సన్మానించారు.

పూజలు నిర్వహిస్తున్న పండితులు



నయనానందకరం సత్యదేవుడి వనవిహారం



అన్నవరం, మే 22: సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా బుధవారం వన విహార మహోత్సవం నయనానందకరంగా జరిగింది. వివాహ బడలికలో ఉన్న నవ దంపతులు సేదతీరేందుకు ప్రతీకగా ఈ వేడుకను నిర్వహిస్తారు. నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి పల్లకిలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ కొండదిగువున ఉన్న ఉద్యానవనానికి తీసుకుని వచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వెండి సింహాసనంపై నవ దంపతులను మరోవేదికపై పెండ్లిపెద్దలైన సీతారాములను ఆశీనులు గావించారు రుత్వికులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం చతుర్వేద పండితుల వేదాశీర్వచనం అనంతరం కొండపైకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విశేష పదార్థాలను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

ఏపీఈఏపీ సెట్‌కు 96.72 శాతం మంది హాజరు

నేటితో ముగియనున్న పరీక్షలు

జేఎన్టీయూకే, మే 22: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి బుధవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 887 మంది హాజరయ్యారని, 40 మంది గైర్హాజరు కాగా 95.69 శాతం హాజరు శాతం నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 934 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 913 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరు కాగా 97.50 శాతం హాజరు శాతం నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 1,861 మంది హాజరు కావాల్సి ఉండగా 1,800 మంది హాజరయ్యారని 61 మంది పరీక్ష రాయలేదని 96.72 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1,434 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1404 మంది హాజరు కాగా మొత్తం 97.91 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో బుధవారం నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690 మంది హాజరు కావాల్సి ఉండగా 671 మంది హాజరు కాగా మొత్తం 97.25 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఏపీఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు గురువారం ముగియనున్నాయన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10 లక్షల విరాళం





దాతలు రత్నాకరరావు, లక్ష్మీశమంతకమణి

అన్నవరం, మే 22: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు, లక్ష్మీశమంతకమణి దంపతులు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాతలు దేవస్థానం నిత్యాన్నదాన అకౌంట్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. దాతలను ఈవో ఫోన్‌లో అభినందించి వారికి దాతల కోటాలో అందించే సదుపాయాలను త్వరితగతిన పంపించాలని అన్నదానం అధికారులను ఆదేశించారు.

3 గంటల ఆలస్యంగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, మే 22: విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మూడు గంటల ఆలస్యంగా సామర్లకోట చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విశాఖ నుంచి బయలుదేరిన జన్మభూమి రైలు ఏసీ బోగీ లింక్ విడిపోయింది. సాంకేతిక లోపంతో విడిపోయిన ఏసీ బోగీ సమాచారాన్ని పైలట్ ముందుగా గుర్తించి అప్రమత్తం కావడంతో విడిపోయిన రెండు ఏసీ బోగీలను తిరిగి లింక్ తగిలించే పనులు నిర్వహణ దృష్ట్యా సుమారు మూడు గంటల పాటు ఆలస్యం అయ్యింది. దీంతో సామర్లకోటకు జన్మభూమి రైలు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంది. రైలు రాక కోసం ఎదురుచూసిన ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ప్రయాణికులకు సరైన సమాచారాన్ని అందజేయకపోవడంతో స్టేషన్లో అందుబాటులో ఉన్న ఆహారాన్ని అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని ప్రయాణికుడు ఫణిశేఖర్ ఆరోపించారు.

అశ్రునయనాలతో కృష్ణబాబుకు వీడ్కోలు

స్వగ్రామం దొమ్మేరులో అంత్యక్రియలు



విలపిస్తున్న కృష్ణబాబు సోదరుడు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల

కొవ్వూరు, మే 22: బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుకు ప్రజానీకం తుది వీడ్కోలు పలికింది. మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు మంగళవారం హైదరాబాద్‌లో అనారోగ్య కారణాలతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. కృష్ణబాబు భౌతికకాయాన్ని మంగళవారం రాత్రి పది గంటలకు కొవ్వూరు మండలం దొమ్మేరు స్వగ్రామానికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. తమ స్నేహితుడిని కడసారి చూసుకునేందుకు అటు తెలంగాణ, ఇటు ఆంధ్రా ప్రాంతాల నుంచి నాయకులు పోటెత్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరు గ్రామం జనంతో నిండిపోయింది. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కృష్ణబాబు స్నేహితులు, మంత్రులు, ఎమ్మెల్యేలు కృష్ణబాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణబాబు సోదరులు నరేంద్రనాథ్ చౌదరి, అచ్చిబాబులను పరామర్శించారు. మధ్యాహ్నం మూడు గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది. దొమ్మేరు గ్రామంలోని రాష్ట్ర రహదారి పక్కన ఉన్న వారి పొలాల్లో కృష్ణబాబు కుమారుడు రవిబాబు దహన సంస్కారాలు నిర్వహించారు. కృష్ణబాబు మృతి వార్త తెలిసిన వెంటనే విచ్చేసిన పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్ర నాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లతో పాటు కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారిలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, గంటా మురళి, జొన్నకూటి బాబాజీరావు, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాసనాయుడు, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నన్నపనేని రాజకుమారి, బొల్ల రాజీవ్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ జడ్పీ చైర్మన్లు ముళ్లపూడి బాపిరాజు, ఇమ్మణి రాజేశ్వరి, నాయకులు ఆళ్ల హరిబాబు, కోడూరి శివరామకృష్ణ, సూరపనేని చిన్ని సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, కేవీకే రంగారావు, కుందుల సత్యనారాయణ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అల్లూరి విక్రమాదిత్య, కొవ్వూరు పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, మద్దిపాటి నాగేశ్వరరావు, దేవీ సీఫుడ్స్ డైరెక్టర్ పొట్రు బ్రహ్మానందం, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు, తణుకు, సగ్గొండలలోని ఆంధ్రసుగర్స్ గ్రూపు సంస్థల ఉద్యోగులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో దొమ్మేరు చేరుకుని కృష్ణబాబుకు నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు), కృష్ణబాబు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎండీ విభాస్ పోలిమర్స్), కుమార్తె అర్చన అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, నవభారత్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్ల రాజీవ్, కృష్ణబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే తపించేవారు : మంత్రి తుమ్మల

కృష్ణబాబుతో తనకు అవినాభావ సంబంధం ఉండేదని, ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే పరితపించేవారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కృష్ణబాబు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణబాబు మరణం నియోజకవర్గానికి తీరని లోటన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఆయన శాసనసభ్యునిగా కొనసాగిన కాలంలో చేపట్టారన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉండి మచ్చలేని నాయకుడిగా కృష్ణబాబు నిలిచారన్నారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకుంటారన్నారు. ప్రజల హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడిగా ఉంటారన్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ కృష్ణబాబు స్నేహానికి ప్రాణం ఇచ్చేవారని, నాలుగు దశాబ్దాలుగా ఇద్దరం ఎంతో సన్నిహితంగా మెలిగామని, ఆయన లేనిలోటు తీరనిదని అన్నారు.



ఇమ్మణి రాజేశ్వరి, కందుల దుర్గేష్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

దొంగ అరెస్టు..రిమాండ్‌కు తరలింపు

రాజమహేంద్రవరం, మే 22(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు ఒక దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉమర్ తెలిపిన వివరాల ప్రకారం.. దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద లారీలను ఆపి డ్రైవర్ల వద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్లు దొంగిలించడం, ఇళ్లల్లో దొంగతనాలపై ఇటీవల ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టారు. ఈ క్రమంలో తన సెల్ దొంగిలించారంటూ ఓ డ్రైవరు చెప్పాడు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సెల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. ఆ సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా దివాన్‌చెరువు హైస్కూల్ వద్ద ఒక వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి మహారాష్ట్రలోని అంతరగావ్‌కి చెందిన నన్న గోపాల్ షిండే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతడిని ప్రశ్నించగా దొంగతనాలు తానే చేస్తున్నట్లు చెప్పాడని సీఐ పేర్కొన్నారు. షిండే నుంచి వెండి వస్తువులను రికవరీ చేశామని.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే రాత్రి వేళల్లో గస్తీ పెంచామని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, మే 22: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన విపర్తి తలుపులయ్య (35) ప్రత్తిపాడులోని బంధువుల ఇంటికి వచ్చి మంగళవారం వచ్చాడు. బుధవారం వేకువజామున లింగంపర్తి వెళుతుండగా హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తలుపులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో ఇద్దరు యువకుల అరెస్టు

గొల్లప్రోలు, మే 22: వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు యువకులను పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను దిశ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు వెల్లడించారు. పట్టణంలోని ఉన్న ఓ మకాంలో ఒంటరిగా జీవిస్తున్న 60 ఏళ్ల వృద్ధురాలిపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే. దీంతో దర్యాప్తు చేయగా ఈ సంఘటనకు పాల్పడిన సామర్లకోటకు చెందిన కోటా చంద్రశేఖర్, తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన కాలబోయిన గంగాధర్‌ను రైల్వేస్టేషన్ సమీపంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. సమావేశంలో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై అనుమానాలు

పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించిన వైనం

రౌతులపూడి, మే 22: బాలుడు అనుమానాస్పద మృతిపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలో పారుపాక గ్రామానికి చెందిన పారుపల్లి రాంబాబు, వెంకటలక్ష్మి కుమారుడు సాకేత్(6) ఈనెల 16న వరుసకు మేనమామ అయిన కుసిరెడ్డి శ్రీనుతో కలిసి బైక్‌పై రౌతులపూడి నుంచి పారుపాక వెళ్తుండగా రౌతులపూడి గ్రామ శివారు బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు గాయం కాగా వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ న్యూరో స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యం పొందుతూ 16వ తేదీన మృతిచెందాడు. సాకేత్ మృతిచెందిన రోజు బంధువులు రావడంతో తల్లి దండ్రులు ఏ ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం బాలుడు మృతిపై అనుమానం రావడంతో బుధవారం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. తహశీల్దార్ విద్యాపతి సమక్షంలో వైద్యులు పాతిపెట్టిన బాలుడు మృతదేహానికి పంచనామా నిర్వహించి మళ్లీ మృతదేహాన్ని పాతి పెట్టినట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని దర్యాప్తు అనంతరం మేనమామ కుసిరెడ్డి శ్రీనుపై చర్యలు తీసుకోనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పంట బోదెలోకి దూసుకెళ్లిన ఆటో

అంతర్వేది, మే 22: అప్పనరామునిలంకలో పాలకొల్లు నుంచి వస్తున్న ఆటో బాడిరేవు వంతెన పంట బోదెలోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. స్థానికుల సాయంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో వారు తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకున్నారు. ప్రమాదకరమైన మలుపు వంతెన వద్ద ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ స్థానికులు వాపోతున్నారు.

పవర్ కట్‌తో గ్రామాలకు అందని తాగునీరు

ఉప్పలగుప్తం, మే 22: వారం రోజులుగా మండలంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. రెండు రోజులుగా గంటల తరబడి పవర్ కట్ అమలు చేయడంతో తాగునీరందక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పంపింగ్‌కు సమయం చాలకపోవడంతో కొన్ని పంచాయతీలకు చల్లపల్లి ప్రాజెక్టు ద్వారా తాగునీరు సరఫరా జరగడం లేదు. అంతంతమాత్రంగా అందుతున్న తాగునీరు బుధవారం పూర్తిగా నిలిచిపోయింది. జనరేటర్ సదుపాయం లేనందున మండు వేసవిలో ప్రజలు తాగునీటికి అల్లాడవలసిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు నిరంతరం సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తకు రూ.50వేలు అందించిన హరీష్

మామిడికుదురు, మే 22: మామిడికుదురుకు చెందిన టీడీపీ కార్యకర్త ముషిణి వెంకటేశ్వరరావు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అతడిని అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ బుధవారం పరామర్శించారు. అతడి వైద్యానికి అయ్యే ఖర్చును భరిస్తానని తెలియజేసి, రూ.50వేలను ప్రస్తుతం అందించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, వర్ధినేని బాబ్జి, బోనం బాబు, ఈలి శ్రీనివాస్, కడలి నూకరాజు, నయినాల వెంకటేశ్వరరావు(అబ్బాస్), ఉంద్రు శ్రీరామారావు, వాసంశెట్టి వెంకట్రావు, మెండా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి రూ.50 వేలు సాయం

ద్రాక్షారామ, మే 22: కాజులూరు మండలం శీల గ్రామానికి చెందిన కోలసంబరం కళాకారుడు వాసిరెడ్డి వెంకన్న అనారోగ్యంతో కాలు కోల్పోయాడు. వెంకటేశ్వర దుర్గాదేవి కోలసంబరం కళాకారుల సంఘం జిల్లా కమిటీ బుధవారం అతడికి రూ.50వేలు అందించింది. కార్యక్రమంలో జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు కోట శ్రీను, అధ్యక్షుడు ఈతా దుర్గారావు, ఉపాధ్యక్షులు వాసంశెట్టి లక్ష్మణరావు, కార్యదర్శి మైగాపుల శ్రీను, జాయింట్ సెక్రటరీ కానబోయిన పెద్దిరాజు, కోశాధికారి వనుం కొండ, వెల్ల ఎంపీటీసీ సభ్యుడు చిక్కాల స్వామికాపు, కూనపురెడ్డి శివకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కపిలేశ్వరపురం, మే 22: కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ తారక వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.19లక్షలు

ఆత్రేయపురం, మే 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,19,159 లభించినట్లు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ఆత్రేయపురం, మే 22: ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూన్ 7వరకు శిబిరం కొనసాగిస్తామని గ్రంథాలయాధికారి నమశ్శివాయ తెలిపారు.

నేడు పీఠంలో వైశాఖ పౌర్ణమి పూజలు

రాయవరం, మే 22: వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురువారం పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. పీఠంలో విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, నక్షత్ర, నవగ్రహ హోమం జరుగుతుందన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

రాయవరం, మే 22: చెల్లూరులో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం తహశీల్దారు ఆర్‌వీ కృష్ణారావు సీజ్ చేశారు. డ్రైవర్లు పరారైనట్లు తెలిపారు. సీజ్‌చేసిన ట్రాక్టర్లను రాయవరం పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

వెలవెలబోతున్న అంగర రైతుబజార్

- ఆర్భాటంగా 2018 నవంబరులో ప్రారంభం
- ప్రస్తుతం ఒక షాపుతో నిర్వహణ
- కూరగాయల పంట సాగు లేకపోవడం





అంగరలో ఏర్పాటు చేసిన రైతు బజార్

కపిలేశ్వరపురం, మే 22: వినియోగదారులకు తక్కువ ధరకు తాజా కూరగాయలను అందించాలన్న లక్ష్యంతో ఆలమూరు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో అంగరలో రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. గతంలో తాజా కూరగాయలు కోసం రావులపాలెం, మండపేట రైతుబజార్లకు వెళ్లాల్సి వచ్చేది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిధులు రూ.31.50లక్షలతో 2018 నవంబరు 18న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏఎంసీ చైర్మెన్ ఈదల నల్లబాబు ఆధ్వర్యంలో అంగరలో రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇది ఏర్పాటుచేసిన కొద్దికాలానికే నిరుపయోగంగా మారింది. కేవలం ఒక షాపు మాత్రమే తెరచి నామమాత్రంగా కూరగాయలను విక్రయిస్తున్నారు. ఈప్రాంతంలో ఎక్కువగా వరిని సాగుచేసే రైతులు ఉండడం వల్ల రైతు బజార్‌కు కూరగాయలు తీసుకువచ్చే రైతులు లేకపోవడంతో ఈపరిస్థితి ఏర్పడినట్లుగా భావిస్తున్నారు. రైతుబజార్లో విక్రయించే కూరగాయల ధరలకు, బయట మార్కెట్లో లభించే కూరగాయ ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. అంగర రైతు బజార్‌కు కూరగాయలు తీసుకువచ్చి అమ్మే రైతులు లేకపోవడం ఒక కారణం అయితే కొనేవాడుడు కూడా లేకపోవడం, గ్రామశివారులో రైతుబజారు ఏర్పాటుచేయడం మరోకారణంగా భావిస్తున్నారు. దీంతో రైతుబజార్ మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖాధికారులు స్పందించి దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఖరీఫ్ సాగుపై దృష్టి పెట్టండి

వ్యవసాయాధికారులకు జేడీ బోసుబాబు సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న బోసుబాబు

ఆలమూరు, మే 22: రబీ ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేసి ఖరీఫ్ వరి సాగుకు రైతులను సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు వ్యవసాయాధికారులు, సిబ్బందికి సూచించారు. ఆలమూరు సబ్ డివిజన్ అధికారి కె.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బుధవారం జరిగిన సమావేశంలో బోసుబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు అధిక శాతం విత్తనాలు సిద్ధం చేసుకుంటారని, మిగిలిన వారికి ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. విత్తనాల కొరత అనే ప్రశ్న రాకుండా చూడాలని సూచించారు. ఖరీఫ్ ప్రారంభం నుంచే ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు విధిగా ముందుగా విత్తన శుద్ధి చేయాలని, తద్వారా తెగుళ్ల బెడద ఉండదని ఏడీ నాగేశ్వరరావు సూచించారు. వీఏవో టెక్నికల్ ఎంఏవో మురళి, ఆలమూరు ఏవో లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సహాయం

మలికిపురం, మే 22: విశ్వేశ్వరాయపురంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నేదునూరి పెద్దింట్లు కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో టార్పాలిన్, వంట సామగ్రి, హైజనిక్ కిట్, కూరగాయలు, నిత్యావసర సరుకులను బుధవారం అందించారు. జంపన బుజ్జిరాజు, బోనం రాజు, తాడి సహదేవ్, నల్లి శివకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

కోనసీమ ప్రాంతంపై దృష్టి పెట్టాలి

మలికిపురం, మే 22: కోనసీమ తీర ప్రాంతం సునామీ, తుఫాన్ ప్రభావాలు, గోదావరి వరదలతోను, ఓఎన్జీసీ కార్యక్రమాలతో కోనసీమ ప్రజలు నిత్యం భయంతో జీవిస్తున్నారని, వీరికి రోడ్డు కనెక్టవిటీ, బ్రిడ్జి కనెక్టవిటీ పెంచి కోనసీమ ప్రజలను ఆదుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వారణాశి రామ్‌మాధవ్‌కు సామాజిక కార్యకర్త బోనం రాజు వినతిపత్రం అందజేశారు. బుధవారం వినతిపత్రం అందించినవారిలో రాజుతో పాటు మంగెన వెంకటనరసింహారావు, గౌరీనాథ్, అడబాల హరికృష్ణ పాల్గొన్నారు.

జూడో సంఘ రాష్ట్ర ప్యాట్రన్‌గా అప్పాజీ



అప్పాజీని సన్మానిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, మే 22: జూడో సంఘ రాష్ట్ర ప్యాట్రన్‌గా చొల్లంగి అప్పాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్ అడవరం నాగూరయ్య ఆధ్వర్యంలో విజయవాడలో సంఘ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో జూడో క్రీడ కార్యాలయాలను స్థాపించడం ద్వారా ఆడపిల్లలకు ఆత్మరక్షణగా జూడో విద్యపై ఉచిత శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్టు అప్పాజీ తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచే బాలికలకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్యాటన్‌గా ఎంపికైన అప్పాజీని పలువురు అభినందించి సత్కరించారు.

ఘనంగా మరిడమ్మ జాతర మహోత్సవం







రాయవరం: సోమేశ్వరంలో సోమేశ్వరస్వామి రథోత్సవం, కపిలేశ్వరపురం: వల్లూరులో కొలువైయున్న ముత్యాలమ్మ మామిడికుదురు:బి.దొడ్డవరంలో వెలసిన అమ్మవార్లు, అంబాజీపేట: ఇటికాలమ్మ అమ్మవారి జాతర

ముమ్మిడివరం, మే 22: రాణేలంక పంచాయతీ పరిధిలోని మొల్లిలో శ్రీమరిడమ్మతల్లి జాతర మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏటా మూడు రోజులు అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆదివారం నుంచి ఈజాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి అమ్మవారిని గరగ నృత్యాలు, సన్నాయిమేళాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు అధికసంఖ్యలో తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించింది.

సత్యనారాయణస్వామి రథోత్సవం

ద్రాక్షారామ, మే22: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న రమాసత్యవతి సమేత సత్యనారాయణ స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం జరిగింది. పుష్పాలంకృతమైన రథంపై కల్యాణమూర్తులను ఆశీనులు గావించి రథోత్సవం నిర్వహించారు. ఈవో పి.టి.వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్ల జాతరలకు ఏర్పాట్లు పూర్తి

మామిడికుదురు, మే 22: బి.దొడ్డవరంలో వెలసి ఉన్న శ్రీ ముత్యాలమ్మతల్లి, గోగులమ్మతల్లి జాతరలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. శనివారం అమ్మవార్లకు శాలివాహనులతో సేవ, 27న అమ్మవారి జాతర, 28నఅమ్మవారికి నైవేద్యాలు, 29న తీర్థం జరుగుతాయని కమిటీ తెలిపింది.

ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం

కపిలేశ్వరపురం, మే 22: వల్లూరులో కొలువైయున్న శ్రీముత్యాలమ్మ అమ్మవారి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, చీరలు, రవికలు, నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అమలాపురం: బండారులంకలో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల వాహనోత్సవం

శివకేశవుల ఆలయంలో వైశాఖ పూజ

అంబాజీపేట, మే 22: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న శ్రీ ఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీభూదేవి శ్రీదేవి సమేత కేశవస్వామివార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం వైశాఖ పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీపాద సూర్యారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకటనరసింహశర్మ, సుదర్శనం కేశవచార్యులు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

ఘనంగా సోమేశ్వరస్వామి రథోత్సవం

రాయవరం, మే 22: సోమేశ్వరం శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు పురస్కరించుకుని బుధవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఆర్.బాలాజీ రాంప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పరిటాల సోమేశేఖరశర్మ అర్చకత్వంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, హారతులు ఇచ్చారు. అనంతరం స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఆశీనులుగావించి రథోత్సవం నిర్వహించారు. రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులు స్వామి,అమ్మవార్లకు హారతులు ఇచ్చారు. 23న త్రిశూలస్నానం, 24న శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

ఘనంగా ఇటికాలమ్మ అమ్మవారి జాతర

అంబాజీపేట, మే 22: మాచవరం గ్రామదేవత శ్రీఇటికాలమ్మ అమ్మవారి జాతర బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో గరగనృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

త్రిశూల సేవ

అమలాపురం రూరల్, మే 22: బండారులంకలోని శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో పంచరాత్ర దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం త్రిశూల సేవ నిర్వహించారు. స్వామి-అమ్మవార్లను ఊరేగించారు. చింతా గణేష్-కవిసశ్రీ దంపతులు ఐదో రోజు త్రిశూల సేవ జరిపారు. ఆలయ పురోహితుడు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో చింతా శంకరమూర్తి, కొండా శ్రీను, చింతా కోటిసూర్యం తదితరులు పాల్గొన్నారు.

వాహనోత్సవ సేవ

అమలాపురంరూరల్, మే22: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న శ్రీపద్మావతి అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం అరటి మామిడితోట, నారాయణరావుపేట యూత్ ఆధ్వర్యంలో హంస వాహనంపై స్వామి-అమ్మవార్లకు వాహనోత్సవ సేవ నిర్వహించారు. అంకం నాగసత్యనారాయణ, పద్మావతి దంపతులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎంపీటీసీ అంకం హిమభారతి, దంగేటి రుద్ర, గుత్తుల మురుగులరాజు, దంగేటి వెంకటశెట్టి, చింతపట్ల బాబు, అంకం పెదరాజు, బిళ్ల విశ్వేశ్వరరావు, నల్లా మధు, అంకం ప్రసాద్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదనరావు



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

ముమ్మిడివరం, మే 22: మనబడి నాడు-నేడు పథకం రెండో దశ పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలోని సమావేశపు మందిరంలో బుధవారం సాయంత్రం మండల విద్యాశాఖ అధికారులు-2తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ నాడు-నేడు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదేశాల మేరకు నాడు-నేడు రెండో దశ పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభించే తేదీ నాటికి పనులన్నింటినీ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారానికి ఒక పాఠశాలను పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలో తాగునీరు, విద్యుద్దీకరణ, తరగతి గదులు, మైనరు, మేజర్ పనులు తదితర మౌలిక వసతులను పూర్తిచేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహకారంతో స్టేజ్ కంప్లిషన్ కూడా పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు కాంపోనెంట్ వారీగా నాడు-నేడు పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షలు నిర్వహించాలన్నారు. పూర్తిచేసిన పనులకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే పనుల జాప్యానికి గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీలు రావాల్సి ఉందని, పనులు పూర్తి చేయడానికి సిమెంటు, ఇసుక కొరత ఉందని ఎంఈవోలు ఈ సందర్భంగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మధుసూదనరావు మండలాల వారీగా సమీక్ష నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఫైనాన్స్ అండ్ అక్కౌంట్స్ ఆఫీసర్ జి.ప్రవీణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	:బాక్
శ్రీలలిత	:మిరల్
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: దర్శిని
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: నటరత్నాలు

అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గురుకుల విద్యార్థులు

రాజోలు, మే 22: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలకు చెందిన 559మంది విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకట్రావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల24నుంచి జూన్ 3వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు 135మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను 207 మంది, ద్వితీయ సంవత్సరానికి 217మంది విద్యార్థులు రాస్తారన్నారు. ఇంటర్ పరీక్షలు ఈనెల24నుంచి 31వరకు జరుగుతాయన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయని డీసీవో వెంకట్రావు తెలిపారు.

బయోడైవర్సిటీ అంశంపై అవగాహన సదస్సు

యానాం, మే 22: యానాం నియోజవర్గంలోని వ్యవసాయశాఖ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఐటీఐ సంయుక్త నిర్వహణలో బయాలజికల్ బయోడైవర్సిటీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం స్థానిక ఐటీఐలో కార్యక్రమం జరిగింది. గోపాలకృష్ణ జీవవైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ఆరోగ్యశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యమ్, ఐటీఐ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, వ్యవసాయశాఖ అధికారి జోగిరాజులు పోటీల్లో ప్రతిభ సాధించిన వారికి బహుమతులను అందజేశారు.

నేడు జిల్లా ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు

అమలాపురం టౌన్, మే22: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్‌కుమార్ తెలిపారు. ఈపోటీల ద్వారా విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పురుషులను, హిందూపురంలో జరిగే పోటీలకు మహిళలను నలుగురు చొప్పునఎంపిక చేస్తామన్నారు.

ప్రధాన రహదారిలో పొంచి ఉన్న ప్రమాదం



అంబాజీపేట, మే22: నిత్యం వందలాది మంది ప్రయాణించే కె.పెదపూడి ప్రధాన రహదారిలో మర్రిచెట్టు ప్రమాద భరితంగా ఉంది. భారీ వృక్షం నెలకొరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతందోనని ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. నిత్యం ఈ రహదారిపై భారీవాహనాలు, వాహనదారులు ప్రయాణిస్తుంటారు.భారీ వృక్షం రహదారి వైపు వాలి ఉండటంతో అటుగా వెళ్లేందుకు వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు వృక్షాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

'మానవాళి మనుగడ జీవ వైవిధ్యంతోనే'



జీవవైవిధ్య దినోత్సవ ప్రచార పత్రాలు ఆవిష్కరణ

అమలాపురం టౌన్, మే 22: జీవ వైవిధ్యంతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డి.శ్రీరామమూర్తి పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఎంప్లాయిస్ హోంలో జీవవైవిధ్య దినోత్సవ వారోత్సవాలను శ్రీరామమూర్తి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సిలబస్ నుంచి జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం అన్యాయమన్నారు. డార్విన్ సిద్ధాంతం ప్రకారం అన్ని జీవులూ మనుగడ సాగించాలన్నారు. రాష్ట్ర పర్యావరణ సబ్ కమిటీ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజామొహిద్దీన్ జీవ వైవిధ్యం విశిష్టతను, ప్రస్తుతం జరుగుతున్న నష్టాలను వివరించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, వీవీఆర్కే అర్జునరావు, పి.భాస్కరరావు, అబ్బిరెడ్డి రామకృష్ణ, జిల్లా కోశాధికారి త్రినాథ్‌కుమార్, చెకుముకి కన్వీనర్ ఎన్.అబ్బులు, బీఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు నమోదు: సీఐ



మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

అంబాజీపేట, మే 22: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ డి.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లా డారు. కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఏజెంటు మాత్రమే అక్కడికి వెళ్లాలన్నారు. అభ్యర్థి గెలుపు అనంతరం ఎటువంటి ర్యాలీ, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. అలాగే బాణాసంచా కాల్పులు కాల్చరాదన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో గుమ్మిగూడి కూడదన్నారు. సైలెన్సర్లు తీసి బైకులు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుంటామన్నారు. దీనిపై ఎస్పీ కార్యాలయంలో మీడియాసెల్‌ను ఏర్పాటుచేసి మోనటరింగ్ చేస్తున్నారన్నారు. జూన్ 4న సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీస్ పికెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి

మలికిపురం, మే 22: మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని మలికిపురం ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్ కోరారు. బుధవారం రామరాజులంకలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లోని అనుమానిత గృహాల్లో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ రోజున ఏజెంట్, అభ్యర్థి అనుమతి ఇచ్చిన వారు తప్ప ఎవరూ కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లరాదని, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

భైరవపాలెంలో కార్డన్ సెర్చ్

ఐ.పోలవరం, మే 22: భైరవపాలెం, జి.మూలపొలం గ్రామాల్లో బుధవారం ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్‌ఐ భానుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 50బైక్‌లు, ఒక పాసింజర్ ఆటో, ఒక అప్పి ఆటోను సీజ్ చేశారు. అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి 450లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు.

వాసాలతిప్పలో...

ఉప్పలగుప్తం, మే22: ఉప్పలగుప్తం ఎస్‌ఐ మనోహర్‌జోషి ఆధ్వర్యంలో బుధవారం వాసాలతిప్పలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాటించవలసిన నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

రామచంద్రపురంలో ...

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే22: రామచంద్రపురం పట్టణంలో రాజబాబునగర్‌లో బుధవారం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది, క్యూఆర్‌టీ సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులులేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పత్రాలుంటే అందించాలని, లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు రాజబాబు నగర్‌లో వచ్చి ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బుద్ధుని జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలి

ముమ్మిడివరం, మే 22: ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమని చాటిన గౌతమ బుద్ధుని జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ పిలుపునిచ్చారు. ఆదుర్రు ఆది దివ్య బౌద్ధ మహాస్థూప ప్రాంగణంలో ఈనెల 26న జరిగే 2569 బౌద్ధ జయంత్యుత్సవాలకు జాతి, కుల, మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. మండలాల్లోని గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించే ప్రచార కార్యక్రమం పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాశి వెంకటరమణ, సకిలే పృథ్విరాజ్, శరత్, కాశి సత్యనారాయణ, సింగపూర్ రమణ సింహాద్రివర్య, కాశి జగపతిరావు, మోర్త వీరసూర్యం, జనిపల్లి చిన్నలతో పాటు అంబేడ్కర్ వాదులు, బౌద్ధ అభిమానులు పాల్గొన్నారు.

హరీష్‌మాధుర్‌కు అభినందనలు

మామిడికుదురు, మే22: అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను బుధవారం మామిడికుదురు టీడీపీ గ్రామశాఖ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.ఎన్నికల్లో అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలుస్తారని తెలియజేస్తూ ఆయన్ను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. మాజీ సర్పంచ్ పోసంశెట్టి విస్సు, నాయకులు ఉంద్రు శ్రీరామారావు, నయినాల అబ్బాస్, కంచి విశ్వనాథం, సాపే ఏకాదశి, వాసంశెట్టి వెంకట్రావు, గోకవరపు శ్రీను, అప్పారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బంకుల వద్ద రైతులకు డీజిల్ ఇప్పించండి



కాట్రేనికోన, మే 22: లూజు పెట్రోలు, డీజిల్ విక్రయాలపై నిషేధం వల్ల తాము నానా ఇబ్బందులు పడుతున్నామని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. డీజిల్ లేనిదే జనరేటర్లు పనిచేయవని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటిని బంకుల వద్దకు తీసుకురావడం కుదరదని అధికారులకు విన్నవించారు. ఆక్వా అవసరాల నిమిత్తం రైతులకు డీజిల్ ఇచ్చేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. త్సవటపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

పేలిన ఏటీఎం బ్యాటరీ

ఉప్పలగుప్తం, మే22: మునిపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎం బ్యాటరీ పేలిపోయి దట్టమైన పొగలు వ్యాపించాయి. మంగళవారం రాత్రి ఈఘటన చోటుచేసుకుంది. వెంటనే బ్యాటరీ కనెక్షన్‌ను తొలగించడంతో ఏటీఎంలో నగదుకు ఎటువంటి హాని జరగలేదు. ముమ్మిడివరం అగ్నిమాపక దళం పరిస్థితిని పర్యవేక్షించింది.

షమ్మీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

యానాం, మే 22: యానాం నియోజవర్గంలో పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. స్థానిక మెట్టకుర్రు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో టోర్నిని యానాం ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం ప్రారంభించారు. ఈటోర్నిలో పది జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాజరామ్మోహనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాలిక శివప్రసాద్, చింతా వెంకన్న, యానాం క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రమేష్, కె.సుబ్బారావు, చిట్టి, ప్రసాద్, ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి పి.సుమన్‌బాబు, సత్యం, జయచంద్ర, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

